https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505485656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

ఛైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 48 శుక్రవారం 13-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# కిమ్ రాజ్యమే బీజేపీ లక్ష్యం!

## ప్రజల ఓట్లతో పనిలేకుండా గెలిచే ప్రయత్నం

**మీనాక్షి నామినేషన్ తిరస్కరణ.. ఆ కుట్రే**
**గాంధీ 8 గాడ్సే రాజకీయాలు పోయాయి**
**గాంధీ 8 కిమ్ పాలిటిక్స్ మొదలయ్యాయి**
**నితిన్ నబీన్‌తో రిటర్నింగ్ అధికారి కుమ్మక్కు**
**కోర్టులో పిటిషన్ వేసి ఆ సీటు గెల్చుకుంటాం**
**ఆర్వో చేసింది రైటని సుప్రీంకోర్టు చెప్పలేదు**
**దేశంలో ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆరే**
**పవన్ తెలంగాణకు వచ్చి పోటీ చేయొచ్చు**
**ఈటలపై బ్యానర్లు కిషన్‌రెడ్డి మనుషుల పనే**
**గూఢచర్యమే కేసీఆర్‌ను ముంచింది**
**మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జూన్ 12**
ఇన్నాళ్లు మహాత్మాగాంధీని హత్య చేసిన గాడ్సేను ఆదర్శంగా తీసుకున్న బీజేపీ ఇప్పుడు ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్‌ను ఆదర్శంగా తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఓట్లు వేయకపోయినా అక్రమ పద్ధతులతో ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అక్రమంగా తిరస్కరించడం ద్వారా బీజేపీ దేశ ప్రజాస్వామ్యానికి, మహిళలకు వ్యతిరేకంగా వ్యవహరించిందని మండిపడ్డారు. గాంధేయవాది అయిన మీనాక్షిని రాజ్యసభలో అడుగు పెట్టకుండా చేయడం ద్వారా దేశంలో గాంధేయ సిద్ధాంతాన్ని అంతం చేయాలని కంకణం కట్టుకొని బీజేపీ, ఆర్ఎస్ఎస్ పని చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాలరాస్తూ, ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా బీజేపీ పాలన కొనసాగుతోందన్నారు. ఓటు చోరీ నుంచి సీటు చోరీ వరకు బీజేపీ దిగజారిందని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికార నివాసంలో ముఖ్యమంత్రి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఉత్తర కొరియాలో కూడా పేరుకు ఎన్నికలు ఉంటాయని, ప్రజలంతా ఓటేస్తారని, పోలింగ్ బూత్‌లో కిమ్ పార్టీకి సంబంధించిన బటన్ మాత్రమే ఉంటుందని తెలిపారు. భారత ప్రజాస్వామ్యం కూడా అదే దుస్థితికి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా విజయం కోసం ఎంతకైనా తెగించే విధానాలను బీజేపీ అవలంబిస్తోందని చెప్పారు. ఆ పార్టీకి కిమ్ ఆదర్శమని అన్నారు. ఇన్నాళ్లు దేశ రాజకీయాలు గాంధీ వర్సెస్ గాడ్సే విధానంలో నడిచాయని, ఇప్పుడు దాన్ని బీజేపీ క్రమంగా గాంధీ వర్సెస్ కిమ్ పద్ధతిలోకి తీసుకెళ్లిందని చెప్పారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో మధ్యప్రదేశ్ రిటర్నింగ్ అధికారి పూర్తిగా బీజేపీ కార్యకర్తలాగా వ్యవహరించారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. బీజేపీకి ఒక్క ఓటు కూడా లేనిచోట రాజ్యసభ స్థానాన్ని ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. రిటర్నింగ్ అధికారి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో కుమ్మక్కు అయ్యారని అన్నారు. బీజేపీ ఒక తప్పు చేసి దాన్ని కప్పిపుచ్చుకొనేందుకు నానా అవస్థలు పడుతోందని అన్నారు. ఇదంతా దేశం చూస్తూనే ఉందని చెప్పారు. ఈ అక్రమంపై న్యాయపోరాటం చేస్తామని, ఎలక్షన్ పిటిషన్ మీద విచారణను ఆర్నెల్లలో ముగించాలని నియమం ఉందని, అక్కడ గెలుచుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఎన్నికల పిటిషన్ వేయమని చెప్పిందే తప్ప రిటర్నింగ్ అధికారి చేసింది ఒప్పేనని ఎక్కడా అనలేదని ప్రస్తావించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంత అడ్డగోలుతనం ఎక్కడా చూడలేదని, ఇది ప్రజాస్వామ్యానికే తలవంపు అని వ్యాఖ్యానించారు. 2022లో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన పంచాయతీకి 2025లో ఇన్‌చార్జిగా వచ్చిన మీనాక్షి నటరాజన్‌కు ఏం సంబంధం అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. "ఎఫ్ఐఆర్ లేదు, ఛార్జిషీట్ లేదు, అసలు కేసే లేదు. అలాంటప్పుడు ఎలక్షన్ అఫిడవిట్‌లో ఏమని మెన్షన్ చేయాలి? నోటీసులు ఇచ్చినా అఫిడవిట్‌లో మెన్షన్ చేయాలనే అంశమే ఎలక్షన్ ఫామ్‌లో లేదు. ఎవరు ఎవరిపై ప్రైవేట్ కంప్లయింట్ ఇచ్చినా కోర్టు నోటీసులు ఇష్యూ చేస్తుంది. వివరణ విన్నాక నిర్ణయిస్తుంది. మరి ప్రధాని మోదీపై దేశవ్యాప్తంగా 1000 ప్రైవేట్ ఫిర్యాదులు నమోదైతే, కోర్టు నోటీసులిస్తే.. మోదీ తన అఫిడవిట్‌లో ఆ 1000 నోటీసుల వివరాలు పొందుపరుస్తారా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ అంశంలో తెలంగాణ కాంగ్రెస్‌ను ముద్దాయిని చేయాలని బీజేపీ వాళ్లు కుట్ర పన్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు తాను ఉమ్మడి శత్రువునని, అందుకే తనను ఒంటరిగా ఎదుర్కోలేక కలిసికట్టుగా మాటల యుద్ధం చేస్తున్నారని అన్నారు. సీటు చోరీని పక్కదారి పట్టించేందుకే రెండు పార్టీలు కాంగ్రెస్ పై ఎదురు దాడికి దిగాయన్నారు. కాంగ్రెస్ లో ఏ పార్టీ ఎమ్మెల్యేలూ చేరలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ పది మందీ తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమేనని చెబుతున్నారని తెలిపారు.



ఫిరాయింపులు ఎలా చేయాలో దేశానికి చెప్పిందే కేసీఆర్ అన్నారు. బీజేపీకి కూడా ఆయనే ఆదర్శం అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో పార్టీల విలీనం ఉంటుంది కానీ, శాసనపక్షం విలీనం ఉండదని, కేసీఆర్ రాజ్యాంగానికే కొత్త సిద్ధాంతం నేర్పారని అన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణకు రావచ్చు, మాట్లాడవచ్చు, ఎన్నికల్లో పోటీ చేయవచ్చు అని రేవంత్ అన్నారు. ఆ హక్కు వారికి ప్రజాస్వామ్యం కల్పించిందని చెప్పారు. అందులో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడతాం అంటే మాత్రం తెలంగాణ వాళ్లూ అదే విధంగా స్పందిస్తారన్నారు. "పవన్ అన్నారు, పొన్నం కౌంటర్ ఇచ్చారు. అంతటితోనే ఆ కథ ముగిసిపోయింది. సభకు అనుమతి ఇవ్వాలా? వద్దా? అన్నది పోలీసుల ఇష్టం. నా ప్రమేయం ఏముంటుంది? తెలంగాణలో అనేక మంది స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు. ధర్నాలు చేస్తున్నారు. వారందరికీ లభించిన అనుమతులు పవన్ కల్యాణ్‌కే ఎందుకు లభించలేదంటే అది పోలీసుల నిర్ణయం. ఏపీలో జగన్‌కు పవన్ ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు?" అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ వాళ్లను ఇంటి నుంచి బయటికే రాకుండా చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత విధానాలను ఎప్పుడూ అవలభించదని చెప్పారు. హైడ్రా అనే పదానికి మూలం హిట్లర్ హయాంలోని జర్మనీ నుంచి వచ్చిందని చెబితే తన వ్యాఖ్యలను వక్రీకరించారని సీఎం అన్నారు. రాహుల్‌గాంధీతో జరిగిన భేటీలో మంత్రివర్గ విస్తరణ అంశం అసలు చర్చకే రాలేదని సీఎం స్పష్టం చేశారు.

# బెంగాల్‌లో 4,000 ఈవీఎంలు దగ్ధం

**అన్నీ ఇటీవలి ఎన్నికల్లో వినియోగించినవే..**
**టీఎంసీ కంచుకోట దక్షిణ 24 పరగణాల పరిధిలోని ఈవీఎంలే.. మంటలు వ్యాపించిన తీరుపై రాష్ట్ర మంత్రి సందేహం**
**రంగంలోకి 'సిట్'.. కుట్ర కోణంపై దర్యాప్తు**
**ఓటరు లిస్టులో స్మృతి ఇరానీ పేరు అదృశ్యం!**



**కోల్‌కతా, జూన్ 12:**
పశ్చిమబెంగాల్‌లోని ఓ ప్రభుత్వ భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 4,000 ఈవీఎంలు దగ్ధమయ్యాయి. కోల్‌కతాలోని అలీపూర్ ప్రాంతంలో ఉన్న తొమ్మిది అంతస్తుల భవనంలో బుధవారం మంటలు చెలరేగాయి. దక్షిణ 24 పరగణాల జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ విభాగాలు ఈ భవనంలో కొనసాగుతున్నాయి. దగ్ధమైన ఈవీఎంలన్నీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన యంత్రాలే. టీఎంసీ కంచుకోట దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 10 నియోజకవర్గాలకు చెందినవిగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ జిల్లా పరిధిలోని మొత్తం 31 స్థానాల్లో టీఎంసీ 21 చోట్ల విజయం సాధించగా, బీజేపీ 10 స్థానాల్లో గెలిచింది. జిల్లా యంత్రాంగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపడానికి శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.

**ప్రమాదమా.. ?.. కుట్రా.. ?**

ఎన్నికల ఫలితాలకు ముందు ఈవీఎంల భద్రతపై, వాటిలో ట్యాంపరింగ్ జరిగిందంటూ తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర ఆందోళనలు నిర్వహించింది. అయితే, ఇప్పుడు ఎన్నికలు ముగిసి స్పష్టమైన ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేయడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తోంది. అగ్ని ప్రమాద విషయాన్ని ఆ రాష్ట్ర మంత్రి కౌశిక్ చౌదరీ గురువారం ధ్రువీకరించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి కౌశిక్ చౌదరీ మాట్లాడుతూ.. "ఇది సాధారణ అగ్ని ప్రమాదంలా అనిపించడం లేదు. మంటలు వ్యాపించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. మొదట రెండు, మూడు అంతస్తుల్లో మంటలు కనిపించాయి. మధ్యలో ఉన్న అంతస్తులకు ఏమీ కాకుండానే.. నేరుగా తొమ్మిది, పదో అంతస్తులకు మంటలు విస్తరించాయి. కుట్ర కోణం దాగి ఉందేమో పరిశీలిస్తున్నాం" అని ప్రకటించడం గమనార్హం. ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే పూర్తి విషయాలు తెలుస్తాయని మంత్రి స్పష్టం చేశారు.

# 'నైరుతి' వర్షాలు!

**నెల్లూరులో దంచికొట్టిన వాన**



అమరావతి,జూన్ 12 : దక్షిణ కోస్తాంధ్ర పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిశాయి. అన్నమయ్య జిల్లా కలికిరిలో 30.5, నిమ్మనపల్లిలో 29.5, చిత్తూరు జిల్లా పలమనేరులో 24.7, కర్వేటినగరంలో 21 మిల్లీమీటర్ల వాన పడింది. శనివారం మన్యం, అల్లూరి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. నైరుతి ప్రభావంతో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవా రం సాయంత్రం భీకర గాలులతో వర్షం కురిసింది.

# హుజూరాబాద్ బీఆర్ఎస్ కంచుకోట

**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు**



**జమ్మికుంట, జూన్ 12**
హుజూరాబాద్ బీఆర్ఎస్ కంచుకోట అని, ఉప ఎన్నిక మినహా అన్ని ఎన్నికల్లో ఇక్కడ గులాబీ జెండా ఎగిరిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్‌లో హుజూరాబాద్ నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ హుజూరాబాద్‌పై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. రైతుబంధు, దళితబంధు పథకాలను ఇక్కడి నుండి ప్రారం భిచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక సమయంలో ఇచ్చిన ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతు డిస్కంను ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యుత్ సరఫరాను రోజుకు ఆరు గంటలకు పరిమితం చేసే పరిస్థితి వస్తుంద న్నారు. రైతుల అవసరాలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం ఇతర కార్యక్రమాలు, హెలికాప్టర్ల కొనుగోళ్లకు మాత్రం భారిగా ఖర్చు చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెకొందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. హుజూరాబాద్ డంపింగ్ యార్డు సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని, మేడిగడ్డ మరమ్మత్తులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసే పరిస్థితి లేదని, తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తి చేస్తామన్నారు.

# ప్రజాసేవకు పునరంకితం

**పెత్తందార్లం కాదు.. ప్రజా సేవకులం**
**తిరుపతి విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు**





**తిరుపతి, జూన్ 12**
రాష్ట్రానికి తాము పెత్తందారులం కాదని, ప్రజా సేవకులమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి పాలన రెండేళ్ల విజయోత్సవంతో ప్రజాసేవకు పునరంకితమవుతున్నామని భావోద్వేగంతో ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి నగర శివారులో దామినేడు సమీపంలో 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరిట నిర్వహించిన బహిరంగ సభను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం భారీ సంఖ్యలో హాజరైన కూటమి పార్టీల శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటుంటే.. గొడ్డలి పార్టీ లేనిపోని దుష్ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. వైసీపీ నేతలకు అభివృద్ధిపరంగా ఒక లక్ష్యం, విజన్ అంటూ ఏదీ లేదని.. వారికున్నదల్లా విషపూరిత మనస్తత్వమేనని ధ్వజమెత్తారు. మద్యనిషేధం అమలు చేశాకే ఓట్లు అడుగుతానన్న వ్యక్తి జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారని, మహిళల మంగళసూత్రాలను తెంచారని ఆరోపించారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చి.. రద్దు చేయకపోగా వారిని వేధించుకు తిన్నారని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ అని ఘనంగా ప్రకటించి ఒక్కసారి కూడా నోటిఫికేషన్ జారీ చేయలేదని, అమరావతిపై ఊసరవెల్లి రాజకీయాలు చేశారని.. ఇపుడు మావిగన్ అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అది మావిగనో లేక వాటికనో అని ఎద్దేవాచేశారు. అమరావతిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు గత ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత ప్రదర్శించారని కొనియాడారు. 57 శాతం ఓటు షేర్‌తో, 90 శాతం సీట్లు ఇచ్చి కూటమిని గెలిపించిన ఘనత వారిదేనన్నారు. పాలనను గాడిలో పెట్టి వారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేం

**రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(బి) దీన్నే స్పష్టం చేస్తోంది**
**గతంలో కూడా ఎన్నడూ కోర్టులు జోక్యం చేసుకోలేదు**
**ఎన్నికల వివాదాలన్నింటినీ ఒకేలా చూస్తాం: సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, జూన్ 12:**
మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికలకు తాను దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను తిరస్కరించటాన్ని వ్యతిరేకిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత దాఖలైన పిటిషన్‌పై విచారణకు అనుమతించలేమని, ఈ మేరకు రాజ్యాంగ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్ పేర్కొన్నారు. ఎన్నికల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవటానికి వీల్లేదని రాజ్యాగంలోని 329 (బి) ఆర్టికల్ స్పష్టం చేస్తోందని తెలిపారు. తెలంగాణలో తన మీద దాఖలైన ఒక కేసు గురించి వెల్లడించలేదన్న కారణంతో రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్‌ను తిరస్కరించటంపై మీనాక్షి నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. మీనాక్షి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఒక అభ్యర్థి నామినేషన్‌ను అక్రమంగా, ఏకపక్షంగా, తప్పుడు నిర్ణయంతో తిరస్కరించినప్పుడు కోర్టులు ఆర్టికల్ 32 కింద జోక్యం చేసుకోవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి ఏకపక్షంగా వ్యవహరించారని, మీనాక్షి నటరాజన్‌పై కేసును కోర్టు గుర్తించలేదని, ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేయలేదని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థకు ఉందన్నారు. ఆయన వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల వ్యవహారాల్లోని అభ్యంతరాలపై జోక్యం చేసుకోవాలని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టు ఎదుట, ఆర్టికల్ 226 కింద హైకోర్టు ఎదుట పలుమార్లు పిటిషన్లు దాఖలయ్యాయని గుర్తు చేసింది. అయితే, రాజ్యాంగంలోని 329 (బి) ఆర్టికల్‌కు అనుగుణంగా.. వీటిల్లో జోక్యం చేసుకోవటానికి సుప్రీంకోర్టు ఎన్నడూ అంగీకరించలేదని తెలిపింది. ఎన్నికల వివాదాలన్న తర్వాత అన్నిటికీ ఒకే నిబంధన వర్తిస్తుందని, వేర్వేరు రకాలుగా ఆ వివాదాలను విభజించి ఆర్టికల్ 329 (బి)కి వ్యతిరేకంగా వ్యవహరించలేమని తెలిపింది. రాజ్యాంగాన్ని అన్వయించే విషయంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించలేమని వ్యాఖ్యానించింది. ఎన్నికల ప్రక్రియ దశలో గతంలో ఏ కోర్టు అయినా జోక్యం చేసుకున్న సందర్భాలు ఉన్నాయా అని జస్టిస్ మిశ్రా ప్రశ్నించారు. అన్ని కేసులకూ ఒకే సాధారణ సూత్రాన్ని వర్తించలేం కదా అని సింఘ్వీ పేర్కొన్నారు. మీనాక్షి పిటిషన్‌ను తిరస్కరించిన న్యాయస్థానం.. ఎన్నికల పిటిషన్ వేసుకోవటానికి అనుమతించింది. ఈ పిటిషనరే కాదు.. ఎవరైనా సంబంధిత హైకోర్టును ఈ మేరకు ఆశ్రయించవచ్చునని తెలిపింది (ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసే పిటిషన్‌ను ఎన్నికల పిటిషన్ అంటారు).

## విద్యా మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి జూన్ 12 మన సమాజం**

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలో ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ హాస్టల్ భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ కళాశాల అధికారి బాలభాస్కర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తాండూర్ మండలంలో ఎస్‌డీఎఫ్ నిధులతో రూ. 1.95 కోట్ల అంచనా వ్యయంతో హాస్టల్ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష కార్యక్రమం కింద ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ. 13.50 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను కలెక్టర్ కుమార్ దీపక్, సబ్ కలెక్టర్ మనోజ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్‌తో కలిసి ప్రారంభించారు.

## బనానా షేక్ లేదా అరటి పండ్లు..

### రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?

మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచి దా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.

**మిల్క్ షేక్ వద్దు..**

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమం టున్నారో ఇప్పుడు తెలుసు కుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటి పండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

**జీర్ణ క్రియకు ఆటంకం..**

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు. కనుక అరటిపండును నేరుగా తీసుకోవ డమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు.

# రామకృష్ణ మరణం విషాదం..

- శవ రాజకీయాలు మరింత విషాదాంతం..!
- చనిపోయిన నాయకుడికి గౌరవం ఇవ్వకుండా శ్మశానవాటిక అజెండాతో పంచాయతీలు
- కుటుంబానికి అండగా నిలిచిన బీఆర్ఎస్‌కు మచ్చ తెస్తున్న వ్యక్తిగత రాజకీయాలు
- ఒక నాయకుడి తప్పిదం వల్ల పార్టీ మొత్తం విమర్శలు ఎదుర్కొనే పరిస్థితి



**మందమర్రి,జూన్ 12, (మన సమాజం ):**

బీఆర్ఎస్ నాయకుడు మారం రామకృష్ణ మరణించిన రోజు నుంచి ఆయన కుటుంబానికి అండగా నిలుస్తూ, దహన సంస్కారాల నుంచి దశదినకర్మ వరకు అన్ని కార్యక్రమాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు భుజాన వేసుకుని నిర్వహిస్తుం డడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు రామకృష్ణ కుటుంబం వెన్నంటే ఉంటూ అన్ని కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహిస్తున్నప్పటికీ, ఒకరిద్దరు నాయకుల వ్యవహారం మాత్రం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

రామకృష్ణ మృతిపై సానుభూతి వ్యక్తం చేయాల్సిన సమయంలో, కొందరు నాయకులు శ్మశానవాటిక అంశాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ పంచాయతీలు మొదలుపెట్టడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రామకృష్ణ మృతి తో పట్టణం ఇంకా విషాదంలో ఉండగానే, పాత వివాదాలను తెరపైకి తీసుకొచ్చి శవాన్ని రాజకీయ అజెండాలకు వేదికగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రామకృష్ణ కోసం పార్టీ మొత్తం ఒక కుటుంబంలా నిలబడితే, ఒకరిద్దరు వ్యక్తులు మాత్రం వ్యక్తిగత కక్షలు, వర్గ ప్రయోజనాలు, స్థానిక రాజకీయ లెక్కల కోసం ఆయన పేరును వినియోగించుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు కార్యకర్తల నుంచే వస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారిక వైఖరి ఒకటైతే, కొందరి వ్యక్తిగత రాజకీయాలు మరోలా కనిపిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రామకృష్ణ చనిపోయిన రోజు నుంచి ఆయన అంత్యక్రియలు, కుటుంబ అవసరాలు, దశదినకర్మ కార్యక్రమాల వరకు పార్టీ నాయకత్వం పూర్తి బాధ్యత తీసుకుని నిర్వహిస్తున్న సమయంలో, ఈ శవ రాజకీయాలు పార్టీ చేసిన మంచి పనులను కూడా మసకబార్చే ప్రమాదం ఉందని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. ఒక నాయకుడి మరణాన్ని గౌరవప్రదంగా గుర్తుంచుకోవాల్సిన చోట, దానిని రాజకీయ ఆయుధంగా మార్చడం ప్రజల్లోకి ప్రతికూల సంకేతాలు పంపే అవకాశం ఉందని అంటున్నారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని ఇలాంటి వ్యక్తిగత ఎజెండాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు కోరుతున్నారు. ఎందుకంటే రామకృష్ణ కుటుంబానికి అండగా నిలిచిన పార్టీకి మంచి పేరు వస్తుండగా, ఒకరిద్దరు నాయకుల శవ రాజకీయాలు మాత్రం ఆ మంచిపేరును దెబ్బతీసే ప్రమాదంగా మారుతున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. రామకృష్ణ ఆత్మకు శాంతి కావాలంటే రాజకీయాలు కాదు, గౌరవం అవసరమనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# రక్షణ లేని భవనాల్లో విద్యాబోధనా..?

- ఎంజేపీ గురుకుల పాఠశాల నిర్వహణపై బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడి ధ్వజం
- పాఠశాలను అనుకూల భవనంలోకి మార్చాలని డిమాండ్




**మన సమాజం/చెన్నూరు:**

పట్టణంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల నిర్వహణపై చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఎండీ నయాబ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కనీస రక్షణ లేని భవనంలో అధికారులు పాఠశాలను నిర్వహిస్తున్నారని, విద్యార్థుల బ్రతుకుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ వారి ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. పాఠశాల భవనానికి ప్రహరీ, ఆట స్థలం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, పాఠశాల భవన ఆవరణలోనే వైన్ షాపు నిర్వహిస్తున్న కారణంగా విద్యార్థులు మద్యం ఆకర్షణకు లోనయ్యే అవకాశం లేకపోలేదని, ఈ విషయమై అనేక మార్లు జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ అధికారుల్లో చలనం కరువైందని, ఇప్పటికైనా పాఠశాల నిర్వహణకు మరో అనువైన భవనంలోకి మార్చాలని, లేని పక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు తీవ్ర ఆందోళనలు చేపడతామని నయాబ్ హెచ్చరించారు.

# ఉపాధి కూలీల పట్ల నిర్లక్ష్యం తగదు

- ఉపాధి హామీ అమలుపై గ్రామస్తుల ఆగ్రహం
- కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో విఫలం
- కూలీల భద్రత గాలికొదిలిన అధికారులు
- ఎంఎస్ఎఫ్ జిల్లా కో-ఇంచార్జి జిల్లాపెల్లి సుగుణాకర్ ధ్వజం
- ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**మన సమాజం/చెన్నూరు:**

గ్రామీణ పేదల ఆర్థిక భరోసాగా నిలవాల్సిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, కూలీల హక్కుల పట్ల అధికార యంత్రాంగం నిర్లిప్త వైఖరి బహిర్గతమవుతోందని ఎంఎస్ఎఫ్ జిల్లా కో-ఇంచార్జి జిల్లాపెల్లి సుగుణాకర్ ధ్వజమెత్తారు. శుక్రవారం కోటపల్లి మండలంలోని సిర్సా గ్రామ కూలీలు అటవి ప్రాంతంలో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఎంఎస్ఎఫ్ ఆద్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ప్రత్యక్షంగా మాట్లాడిన అనంతరం సుగుణాకర్ మాట్లాడుతూ, పలు ఆందోళనకర అంశాలపై ప్రశ్నించారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా ఉండాల్సిన తాగునీరు, సామర్థ్య పానీయాలు, గ్రీవెన్స్ రిజిస్టర్, ఫస్ట్ ఎయిడ్/మెడికల్ కిట్ వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో లేవని తెలిపారు. మండుతున్న ఎండల్లో రోజంతా శ్రమిస్తున్న కార్మికులకు కనీస రక్షణ చర్యలు సైతం కల్పించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోందని విమర్శించారు. ఇటీవల పనికి వెళ్తున్న సమయంలో ఆటోలోకి పాము రావడంతో భయాందోళనకు గురైన కూలీలు కిందపడటంతో పలువురికి గాయాలైన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్ తప్పనిసరి అయినప్పటికీ, అలాంటి ఏర్పాట్లు లేకపోవడం కూలీల భద్రత పట్ల అధికారుల వైఖరిని ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు. కూలీల ప్రాణాల కంటే కాగితాలపై నమోదయ్యే నివేదికలకే ప్రాధాన్యత ఇస్తున్నారా అని ప్రశ్నించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్న గ్రామ కార్యదర్శి సూచనను కూడా ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి రెడ్డి తిరస్కరించారని ప్రస్తావించారు. కూలీల సంక్షేమం కోసం అమలు చేయాల్సిన నిబంధనలను క్షేత్రస్థాయిలోనే నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం నిర్ణీత వ్యవధిలో అందాల్సిన వేతనాలు సకాలంలో జమ కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమించిన కూలీ కోసం వారాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనడం పేద కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. అంతకుమించి, కూలీల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన వారిని అడ్డుకునే ప్రయత్నాలు జరిగినట్లు స్థానికులు ఆరోపించడం మరింత ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రజల సమస్యలను వినాల్సిన అధికారులు, వాటిని పరిష్కరించాల్సింది పోయి వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం అధికారుల దయాదాక్షిణ్యాలపై నడిచే కార్యక్రమం కాదని, అది పేదల చట్టబద్ధ హక్కు అని సుగుణాకర్ స్పష్టం చేశారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వేతనాల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో, డీఆర్‌డీఓ మరియు సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ వారి హక్కులు, భద్రత, జీవనోపాధితో చెలగాటం ఆడే ధోరణికి ముగింపు పలకాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ సిర్సా గ్రామ అధ్యక్షుడు జిల్లాపెల్లి శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జిల్లాపెల్లి రాకేష్, ఉపాధ్యక్షుడు అరె సత్యనారాయణ, జనగామ చంద్రు, రాతిపెల్లి గణేష్, రేవెల్లి సతీష్, రాతిపెల్లి రవి, గగ్గూరి గణేష్, గగ్గూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బూరుగు పల్లిలో నూతన మహిళా సంఘం భవనం ప్రారంభం

**నూతన భవనం ప్రారంభం చేసిన భూ స్థలదాత కుటుంబ సభ్యులు**

**ఘనంగా కొలుపుల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు**





**కరీంనగర్ జూన్ 12**

బోయిన్ పల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నూతన మహిళా సంఘం భవనం ప్రారంభ కార్యక్రమాన్ని భూ స్థల దాతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కొలుపుల శ్రీకాంత్ స్మారకార్థం రెండు గుంటల భూమిని నూతన మహిళా సంఘం భవనానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు గతంలో పాలకవర్గం ఆధ్వర్యంలో నూతన భవన ప్రారంభాన్ని మూడు నెలల్లో అందరి సమక్షంలో చేస్తామని హామీ ఇచ్చామని ఇచ్చిన మాట విధంగా త్వరితగతిన పాలకవర్గం ఆధ్వర్యంలో నేడు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగ పరుస్తూ గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. కొలుపుల శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా వారి ఆత్మీయ స్నేహితుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గ్రామంలోని గ్రామస్తులు పాల్గొన్నారు. తదనంతరం కొలుపుల శ్రీకాంత్ స్నేహితుల ఆధ్వర్యంలో జన్మదినం సందర్భంగా ఘనంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయన స్నేహితులు మాట్లాడుతూ కొలుపుల శ్రీకాంత్ చిన్నతనంలో అందరితో కలిసి మెలసి ఉండేవాడని ఆయన మరణం చాలా కలిసి వేసిందని పేర్కొన్నారు. ఆయనతో గడిపిన ప్రతిక్షణం మర్చిపోలేక పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెరుక గౌతమీ మహేష్, మ్యాన వర్షిత వెంకటేష్, అతికం రాజశేఖర్ గౌడ్, బరిగే రాధా రమేష్ , గ్రామం లోని మహిళా సంఘం సభ్యులు,కుల సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కౌమార యువతలో జీవన నైపుణ్యాలను పెంపొందించాలి

**లయన్ జిల్లా గవర్నర్ కోదండరామ్ సింహరాజు**




**కరీంనగర్ జూన్ 12**

యువభారతంలోని అతి ముఖ్యమైన విభాగం అయిన కౌమార యువతలో సరైన ఆధునిక జీవన నైపుణ్యాలు పెంపొందిస్తేనే రేపటి భారతదేశానికి సమర్థవంతమైన నాయకత్వం లభిస్తుందని లయన్ జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరామ్ అన్నారు. ఈ రోజు స్థానిక సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల(జదీూజు) ప్రాంగణంలో శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వహించిన ప్రతిష్ఠాత్మక రెండు రోజుల లయన్స్ క్వెస్ట్ టీచర్ ట్రైనింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టీన్ ఏజ్ యువత శరీరంలో వచ్చే హార్మోనల్ మార్పులకు అనుగుణంగా వారి మానసిక స్థాయిని సరైన పద్ధతిలో మార్గదర్శనం చేయడానికి లయన్స్ క్వెస్ట్ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. కౌమార యువత వ్యక్తిగత శారీరక, మానసిక, భావోద్వేగ సమతుల్యత సాధించేందుకు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాస శిక్షణ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని లయన్స్ క్వెస్ట్ శిక్షణను ఏర్పాటు చేసేతున్నామని తెలిపుతూ ఈ టీచర్ల శిక్షణ తరగతులను ప్రారంభించారు. విశిష్ట అతిథిగా హాజరైన లయన్ ఎం భద్రేశం మాట్లాడుతూ మార్కులు, ర్యాంకుల చుట్టు తిరుగుతున్న నేటి విద్యావిధానంలో పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి కృషి జరగడం లేదని తెలిపారు. మన పునాదులను నేటి టీన్స్‌కు పరిచయం చేయాల్సిన అవసరముందన్నారు. సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (జదీూజు) చైర్మన్ లయన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి నిపుణులు తయారు చేసిన అంశాలతో కూడిన శిక్షణ అవకాశాన్ని తాము సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు. చైర్మన్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థి చుట్టు సహచరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం వలయం ఏర్పడిందని, దీని ప్రాముఖ్యతను పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన లయన్ పి.ప్రవీణ్ మాట్లాడుతూ 5 లక్షల రూపాయలు వెచ్చించి చేస్తున్న లయన్స్ క్వెస్ట్ టీచర్ల శిక్షణకు ఈ పాఠశాల అర్హత సాధించడం హర్షణీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డితో పాటు శాతవాహన లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎం.మహెందర్, జిఎల్‌టీ కోఆర్డినేటర్ ఈ.రమేష్, రీజియన్ చైర్మన్ లయన్ వి.జగదీశ్వర చారి, కార్యదర్శి లయన్ జి.చంద్ర శేఖర్, కోశాధికారి లయన్ పి.సురెందర్, లయన్ ఎన్.వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ 2-రోజుల శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రేనర్ కె.రేణుక, పాఠశాల ప్రిన్సిపల్ ప్రియదర్శిని, విజన్ స్కూల్ ఉపాధ్యాయులు ఐదుగురు, సెయింట్ జార్జ్ పాఠశాలకు చెందిన 24 టీచర్స్, 05 గురు ప్యారడైజ్ శిక్షణలో ఎంపికైన విలువైన సమయాన్ని వెచ్చించారు.

# నీలోజిపల్లి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం చర్యలు

**సర్పంచ్ అను ముల భాస్కర్ ఆధ్వర్యంలో కొత్త వాటర్ ఫిల్టర్ల ఏర్పాటు ; ట్యాంకుల శుభ్రత కార్యక్రమం**

**బోయిన్ పల్లి జూన్ 12**

బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని బాలవికాస్ కేంద్రంలో కొత్త వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ ఫిల్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలుషిత నీటి వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను నివారించేందుకు శుద్ధమైన నీటి వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు.అలాగే గ్రామంలోని తాగునీటి ట్యాంకులను ప్రత్యేకంగా శుభ్రం చేసి, పరిసరాలను పరిశుభ్రంగా



ఉంచే కార్యక్రమం నిర్వహించారు. నీటి నిల్వ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సర్పంచ్ ఆధ్వర్యంలో నిరంతరం కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. బాలవికాస్ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన ఈ తాగునీటి సదుపాయంపై వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బాలవికాస్ కేంద్రం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**నాగారం, జూన్ 12**

నాగారం మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన బొబ్బలి లింగస్వామి ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మరణించగా ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు లింగస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి 10,000 (పదివేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట గోపాల్ రెడ్డి,గంగి బిక్షపతి, పేరాల వెంకన్న,వార్డు మెంబర్లు కన్నెబోయిన శ్వేత- లింగస్వామి,బోల్లెడ్ల నందిని-నరేష్,కన్నెబోయిన రమేష్,బుడిగే పవన్,గోడదాటి సైదులు, చిల్లర వెంకన్న,గంగి కొండయ్య,వంగూరినాగార్జున, బొట్టు సురేష్,నాగిళ్లకాశీం, బొట్టుమధు,బోల్లెడ్ల రాజేష్, వంగూరి అవిలమల్లు, వంగూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు

# తడగొండలో 30 ఏళ్ల సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికుడు దుర్గయ్య ను సన్మానించి న బుర్ర కనకయ్య



**కరీంనగర్ జూన్ 12**

తడగొండ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా గత 30 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన కట్ట దుర్గయ్యను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుర్ర కనకయ్య ఘనంగా సన్మానించారు. గ్రామానికి ఎనలేని సేవలు అందించిన దుర్గయ్య కి బుర్ర కనకయ్య ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి చిరు సన్మానం నిర్వహించారు. మూడు దశాబ్దాల పాటు గ్రామ పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేసిన దుర్గయ్య సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచి మనసుతో దుర్గయ్య ను సన్మానించిన బుర్ర కనకయ్య ని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గయ్య కి శుభాకాంక్షలు తెలిపారు.

# నిరుపేద పేద మహిళలకు పెళ్లికి ఆర్థిక సాయం అందజేత

**కరీంనగర్ జూన్ 12**



బోయిన్ పల్లి మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబం బొడ్డు దుర్గయ్య కుమార్తె అయిన బొడ్డు ఖుషి కి వివాహం ఈనెల 18వ తారీఖున ఉండగా వారి కుటుంబం పరిస్థితిని చూసి చలించి ప్రముఖ సామాజికవేత్త తూడి లచ్చన్న ఆధ్వర్యంలో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తూడి లచ్చన్న మాట్లాడుతూ ఇలాంటి నిరుపేదలు ఎంతోమంది కి సహాయం చేయడమే నా యొక్క ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లమోహన్ టిఎల్ యువసేన సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

**కరీంనగర్ జూన్ 12**




పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన చామన పల్లి శ్రీనివాస్ అనునతడు తన ట్రాక్టర్ నందు మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి తన ట్రాక్టర్లో కరీంనగర్ వైపుకు తరలిస్తుండగా తీగలగుట్టపల్లి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు మరియు కరీంనగర్ కిసాన్ నగర్ కు చెందిన వీర్ల సంపత్ అనునతడు మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి తన ట్రాక్టర్లు తరలిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ ఆసుపత్రి వద్ద పోలీసులు పట్టుకున్నారు, అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితుల పై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించడం జరిగినది మరియు , ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని సన్మానించిన మంద వేణుగోపాల్ గౌడ్

**కరీంనగర్ జూన్ 12**



కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన గౌడ బాంధవుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ గౌండ్ల ఆడబిడ్డ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి గౌడ నిత్యాన్నధాన సత్రం కొండగట్టు ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కోల రాజేశం గౌడ్ లు శుక్రవారం బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను శాలు వాతో సత్కరించి గౌడ నిత్యాన్న ధాన సత్రం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్బంగా మంద వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థులు రాజకీయంగా ఎదగాలని అన్ని రంగాలలో ముందుండి గౌడ జాతిని అభివృద్ధి దిశగా తీసుకొని వెళ్ళాలని అన్నారు. రాజకీయ పార్టీలు ఏవైనా కాని గౌడ కులస్థులు ఐక్యంగా ఉండి గౌడ కులస్థుల సమస్యలపై పోరాడాలని కోరారు.మా గౌడ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియామకం చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం అందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కొండగట్టు గౌడ నిత్యాన్నధాన సత్రం అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు..

# కరెంటు కలెక్షన్ తొలగించాలి

**దేశాయి పల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత**



**బోయిన్ పల్లి జూన్ 12**

బోయిన్ పల్లి మండలం లోని దేశాయి పల్లి సర్వీసు నెంబర్ 179 యొక్క కలెక్షన్ ను తొలగించాలని దేశాయి పల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. భూ సేకరణ చట్టం ప్రకారం లబ్ధి పొందిన వ్యక్తి ఆ ప్రదేశంను వీడక అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడని తెలిపారు. దానికి సంబంధించిన పూర్తి వివరాలను సెస్ ఏ.ఈ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.




## నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

## వ్యూస్ కోసం దిగజారొద్దు..

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.





## అవన్నీ రూమర్లే!



అచ్చ తెలుగందం శ్రీలీలకు యువతరంలో ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. అందుకే ఈ అమ్మడు విజయాలతో సంబంధం లేకుండా భారీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. అదే సమయంలో గత కొంతకాలంగా ఈ భామ వ్యక్తిగత జీవితం గురించి రూమర్లు రావడం పరిపాటిగా మారింది. తాజాగా క్రికెటర్ తిలక్‌వర్మతో ఈ ఆమె డేటింగ్‌లో ఉందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. గత డిసెంబర్‌లో వీరిద్దరూ తిరుమలను సందర్శించడం, ఆపై ముంబయిలో టీ20 మ్యాచ్‌ను తిలకించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా వీటిపై శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందించారు. ఇవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం శ్రీలీల కెరీర్ మీదనే దృష్టి పెట్టిందని వివరణ ఇచ్చారు. మరో ఐదేళ్ల తర్వాతే తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. గతంలో బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందనే ప్రచారం కూడా జరిగింది. ఈ వార్తలను కూడా స్వర్ణలత ఖండించారు. తానూ, కార్తిక్ ఆర్యన్ తల్లి ఇద్దరం గైనకాలజిస్టులం కావడంతో వృత్తిపరంగా కలుసుకొని అనేక విషయాలు మాట్లాడుకుంటామని, దీనిని కారణంగా చూపించి కార్తిక్ ఆర్యన్, శ్రీలీల మధ్య రిలేషన్‌షిప్ వార్తలను సృష్టించారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

## ఇక తమిళం వంతు!

దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే.
ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం.
కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట.
త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.